క్లుప్తంగా

ఘనంగా పుష్పయాగ మహోత్సవం



తాడిగడప పుష్పయాగ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: తాడిగడప ఎల్వీ గార్డెన్స్‌లోని శ్రీలక్ష్మి వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం పుష్పయాగ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి పుష్పయాగ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. దాదాపు 18 రకాల పుష్పాలతో పుష్పయాగ మహోత్సవం చేశారు. తొలుత 4 గంటలకు సుప్రభాత సేవ,5 గంటలకు తోమాలసేవ, 7 గంటలకు పుష్పయాగ పుష్పాల గ్రామోత్సవం, తదితర పూజలు నిర్వహించారు.

ఘనంగా బాబా ఆలయ వార్షికోత్సవం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని షిర్డీ సాయిబాబా ఆలయం వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వెంకట్రావు, శ్రీనివాసరావు నేతృత్వంలో సాయిబాబాకు పంచామృత అభిషేకం వైభవంగా జరిగింది. అష్టోత్తర సహస్ర నామ పుష్పార్చన, ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి బాబాను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు కోడెబోయిన బాబి, రావి ఈశ్వరి, తవ్వా ఆదిలక్ష్మి, నాగమణి పాల్గొన్నారు.

ఆస్తి పన్ను బకాయిపై వడ్డీ మాఫీ

ఉయ్యూరు: ఆస్తిపన్ను బకాయిపై ప్రభుత్వం ప్రకటించిన వడ్డీ మాఫీని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు కోరారు. స్థానిక విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను బకాయిలపై వడ్డీ మాఫీ కలిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం వరకూ ఉన్న బకాయిలు, పన్నుపై విధించిన వడ్డీని వన్‌టైమ్ మేజర్‌గా మాఫీ చేయటం జరిగిందన్నారు. పన్ను చెల్లింపుదారులు ఆస్తి పన్నులను బకాయితో సహా ఈనెల 31వ తేదీ లోగా చెల్లిస్తే వడ్డీ మినహాయింపు లభిస్తుందన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కౌంటరు, వార్డు సచివాలయాల్లో పన్నులు చెల్లించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

కంకిపాడు: మండలంలోని పలు గ్రామాల్లో ఈ నెల 20వ తేదీన విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ పి.హరిబాబు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన వివరాలు తెలుపుతూ కంకిపాడు పట్టణంలో సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ టౌన్ -2 ఫీడర్‌లో విద్యుత్ లైన్లు మరమ్మతులు చేపట్టాల్సి ఉందన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. కంకిపాడు ప్రభుత్వాసుపత్రి, పోలీసు స్టేషన్, మహాలక్ష్మిమాను, బస్టాండు సెంటరు, అంకమ్మతల్లి గుడి, బ్యాంకు కాలనీ, మార్కెట్ యార్డు, సినిమాహాలు సెంటరు, గొడవర్రు లిక్కరు కంపెనీ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. ఉప్పలూరు పరిధిలో 11 కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఉప్పలూరు, మంతెన లోకేష్ ఫౌండ్రి, అమెజాన్ గోదాము, తెన్నేరు రైస్‌మిల్లు, ఇందిరమ్మ కాలనీ, జగనన్న లేఅవుట్, నిమ్మతోట, బీసీ కాలనీ, రైల్వేస్టేషన్, హనుమాన్ పేటలో విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు ఉపాధి పనులపై ప్రజావేదిక

ఉంగుటూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 2021–22 ఆర్థిక సంవత్సరంలో 27 గ్రామాల్లో రూ.7.16 కోట్లతో చేసిన పనులపై మండల పరిషత్ కార్యాలయం వద్ద ఈ నెల 21న ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జీఎస్వీ శేషగిరిరావు తెలిపారు. ఈ నెల13 నుంచి 19 వరకు సమాజిక గ్రామ సభలు నిర్వహించారు. ఈ క్రమంలో ఆదివారం అముదాలపల్లిలో గ్రామ సభ నిర్వహించి డీఆర్‌పీలు, సీఆర్పీలు ఆయా పనుల వివరాలను వెల్లడి చేశారు. ఉపాధి పనుల్లో అభ్యంతరాలు ఉంటే మండల పరిషత్ వద్ద జరిగే ప్రజా వేదిక దృష్టికి తీసుకురావాలని తనిఖీ బృందం తెలిపింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డి.వెంకటరమణ, డీఆర్‌పీ రంజిత్, రమేష్‌బాబు, ఎస్ఆర్పీ వెంకటేశ్వరరావు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

పెనమలూరు: గంగూరు గ్రామ పరిధి బందరు రోడ్డు పై జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు అవ్వటంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పమిడిముక్కల మండలం మేడూరు గ్రామానికి చెందిన యాసిన్‌ఖాన్ ఆయన భార్య అక్బర్‌ఉన్నిసా గంగూరు వద్ద సీతారామగార్డెన్స్ కల్యాణ మండపంలో కార్యక్రమానికి వచ్చారు. వారు కల్యాణమండపం ఎదురుగా ఉన్న బందరు రోడ్డు దాటుతుండగా విజయవాడ నుంచి కంకిపాడు వైపుకు వెళుతున్న బైక్ అక్బర్‌ఉన్నిసాను ఢీ కొట్టాడు. ఈ ఘటనలో ఆమెకు గాయాలు అవ్వటంతో పోరంకిలో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సకై చేర్చారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

కరకట్టపై వ్యర్థాలతో ఇక్కట్లు

- అసౌకర్యానికి గురవుతున్న ప్రయాణికులు
- రోడ్డు మార్జిన్‌లు లేక ప్రమాదాలు
- చర్యలు తీసుకోవాలని వినతి

పెనమలూరు: నిత్యం రద్దీగా ఉండే విజయవాడ–అవనిగడ్డ కరకట్ట రోడ్డుకు ఇరు పక్కల చెత్త కుప్పలు, వ్యర్థాలు వేయటంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. చెత్తకుప్పలు కారణంగా రోడ్డు మార్జిన్లు లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. విజయవాడ–అవనిగడ్డ కరకట్టపై దివిసీమ ప్రయాణికులు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. ఆర్టీసీ బస్సులు కూడా కరకట్ట పైనే తిరుగుతున్నాయి. దివిసీమ వాసులు విజయవాడకు రావటానికి దగ్గర మార్గం కరకట్ట కావటంతో విపరీతమైన ట్రాఫిక్ ఉంటుంది. దీనికి తోడు ఇసుక లారీలు కూడా తిరుగుతున్నాయి. అయితే చెత్త కుప్పల కారణంగా కరకట్ట రోడ్డు ఇప్పుడు అత్యంత ప్రమాదకరంగా మారింది.

రోడ్డు పక్కనే చెత్త గుట్టలు...

కరకట్ట పై చెత్త గుట్టలు పెద్ద ఎత్తున ఉన్నాయి. విజయవాడ నగరానికి దగ్గరగా ఉండటంతో యనమలకుదురు–పెదపులిపాక మధ్యలో రోడ్డుకు



కరకట్టపై తాగి పడేసిన కొబ్బరి బోండాలు

ఇరుపక్కల తాగేసిన కొబ్బరి బోండాలు, ఉపయోగానికి అక్కర లేని బిల్డింగ్ మెటీరియల్, కాలం చెల్లిన మందులు, వ్యర్థాలు, మరుగుదొడ్ల వేస్టు, కోడి మాంసం, పంది వ్యర్థాలు ...ఇలా అనేక రకాల చెత్తాచెదారం తీసుకు వచ్చి కరకట్ట రహదారి పక్కనే గుట్టలుగుట్టలుగా వేస్తున్నారు. మరి కొందరు దివిసీమ వాసులకు సాగునీరు అందించే కేఈబీ కెనాల్‌లో చెత్తను డంప్ చేస్తున్నారు. మరి కొందరు కరకట్ట రోడ్డుకు ఆనుకునే బడ్డీ కొట్లు పెట్టి రోడ్డు ఆక్రమించారు. దీంతో కరకట్ట పై దుర్గంధం రావటమే కాకుండా రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి

> **సమాచారం అందించాలి**
>
> కరకట్ట పై నిఘా ఏర్పాటు చేస్తాం. ఉన్న చెత్త తొలగించుతాం. ఎవరైన వాహనంలో చెత్త తీసుకొచ్చి వేస్తే వాహనాలు సీజ్ చేస్తాం. స్థానికులు కూడా తమకు సమాచారం ఇవ్వాలి.
>
> –ఎస్.ప్రకాశరావు, కమిషనర్, తాడిగడప మున్సిపాలిటీ

ప్రమాదాలు జరుగుతున్నాయి. పెదపులిపాక చిన్నకట్ట పై కూడా ఇదే పరిస్థితి ఏర్పడింది. ఈ ప్రాంతంలో వ్యాధులు ప్రబలే ప్రమాదం కూడా ఉంది.

ప్రమాదకరంగా ప్రయాణం....

గతంలో కరకట్ట పై చెత్త వేసిన వారిని పట్టుకుని భారీ జరిమానా వేశారు. అయితే ఇప్పుడు కరకట్ట పై నిఘా లేకపోవటంతో విచ్చలవిడిగా చెత్త, వ్యర్థాలు వేస్తున్నారు. తాడిగడప మున్సిపాలిటీ స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే కరకట్ట ప్రయాణం అత్యంత ప్రమాదకరంగా మారుతుంది.

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు

గన్నవరం రూరల్: ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు జరుగుతుందని కృష్ణా జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ కె.పార్థసారథి చెప్పారు. ఆదివారం మండలంలోని పురుషోత్తపట్నం గ్రామంలో రైతు సాధికార సంస్థ, ఏపీ కమ్యూనిటీ మేనేజ్‌డ్ నేచురల్ ఫార్మింగ్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన సదస్సు జరిగింది. ఢిల్లీకి చెందిన ది అబ్దుల్ లతీఫ్ జమీల్ పవర్టీ యాక్షన్ ల్యాబ్ ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొన్నారు. బీజామృతం, ఘన జీవామృతం, నీమాస్త్రం, అగ్ని అస్త్రం తయారీపై వివరాలను తెలుసుకున్నారు. పార్థసారథి మాట్లాడుతూ దేశీ ఆవుపేడను పలచటి వస్త్రంలో మూటకట్టి 20 లీటర్ల నీరున్న తొట్టిలో 12 గంటలు ఉంచి, వేరే పాత్రలో లీటరు నీటికి 50 గ్రాములు సున్నం కలిపి రాత్రంతా ఉంచాలని, రెండో రోజు నానబెట్టిన పేడమూటను చేతితో పిండి సారాన్ని నీటి తొట్టిలో కలపాలన్నారు. పేడనీరు ఉన్న తొట్టిలో పుట్ట మన్నును పోసి కర్రతో కుడివైపునకు కలియతిప్పితే బీజామృతం తయారవుతుందన్నారు. దీనిని విత్తనాలకు బాగా పట్టించి వాటిని



రైతులతో మాట్లాడుతున్న ల్యాబ్ ప్రతినిధులు, జిల్లా అధికారులు

నీడలో ఆరబెట్టి నాటడానికి సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ ప్రక్రియతో పంటలు నాణ్యంగా, అదనంగా వస్తాయని, చీడపీడలు ఉండవని చెప్పారు. ఢిల్లీకి చెందిన ప్రతినిధులు తాన్య కాక్, పురభి చటర్జీ, టి.రాజేష్, రీజనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ప్రకాశ్‌రావు, జిల్లా అడిషనల్ ప్రాజెక్టు మేనేజర్ నాగమల్లేశ్వరీ, రైతులు, ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్‌పీలు పాల్గొన్నారు.

వణుకూరులో చర్చిపై కూలిన కొబ్బరి చెట్టు



చర్చి పై పడిన కొబ్బరి చెట్టు

పెనమలూరు: వణుకూరు గ్రామంలో శనివారం అర్ధరాత్రి వచ్చిన గాలి వానకు కొబ్బరి చెట్టు చర్చి పై పడటంతో చర్చి ధ్వంసమయింది. గ్రామంలో సెవంత్ డే అడ్వెంటిస్టు చర్చి పక్కనే కొబ్బరి చెట్టుంది. అయితే రాత్రి పొద్దు పోయే వరకు చర్చిలో దాదాపు 200 మంది భక్తులు ప్రార్థనలు చేశారు. భక్తులు ఇళ్లకు వెళ్లిన తరువాత ఒక్కసారిగా గాలివాన రావటంతో చర్చి పక్కనే ఉన్న పెద్ద కొబ్బరి చెట్టు చర్చి పై పడింది. ఆసమయంలో చర్చిలో ఎవ్వరు లేక పోవటంతో పెద్ద ప్రమాదం తప్పింది. చెట్టుపడటంతో చర్చి పై రేకులు పూర్తిగా ధ్వంసమయ్యాయి.

923 హెక్టార్లలో పంట నష్టం

హనుమాన్‌జంక్షన్ రూరల్: గత మూడురోజులుగా కురిస్తున్న అకాల వర్షాలతో బాపులపాడు మండలంలో 923 హెక్టార్లలో మొక్కజొన్న, అపరాల పంటలకు నష్టం వాటిల్లినట్లు మండల వ్యవసాయాధికారి జొన్నలగడ్డ భవాని ఆదివారం తెలిపారు. మండలంలోని ఆరుగొలను, వీరవల్లి, కొత్తపల్లి, బిళ్లనపల్లి, ఓగిరాల, కురిపిరాల, వెంకట్రాపురం, సిరివాడ, కాకులపాడు, కానుమోలు, కోడూరుపాడు, అంపాపురం గ్రామాల్లో మొక్కజొన్న, మినుము, పెసర పంట సాగు చేసిన రైతులు నష్టపోయినట్లు ప్రాథమికంగా అంచానా వేసినట్లు ఆమె చెప్పారు. మొక్కజొన్న పంట 39 హెక్టార్లు, మినుము 443 హెక్టార్లు, పెసర 441 హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లిందని వివరించారు. ఆయా గ్రామాల్లో మొక్కజొన్న, మినుము, పెసర పంట కోతదశలో ఉండగా, మరికొన్ని చోట్ల కోతలు పూర్తయి కుప్పలుగా వేసి ఉన్నాయన్నారు.

నడకతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): నడకతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని, వివిధ ఆరోగ్య సమస్యలు దూరమవుతాయని వాకర్స్ అసోసియేషన జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.పి. రవీంద్ర అన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో విజయవాడ వాకర్స్ అసోసియేషన్ 24వ వార్షికోత్సవం వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో స్టో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ చదువుతున్న ఉత్తమ పేద విద్యార్థులకు ఆర్థికసాయం చేశారు. రవీంద్ర మాట్లాడుతూ దేశ భవిష్యత్‌కు నేటి విద్యార్థులే పునాదని, ఉత్తమ విలువతో విద్యనభ్యసించి ప్రపంచ స్థాయిలో అవకాశాలు అందిపుచ్చుకుని ఉన్నత స్థితికి ఎదగాలన్నారు. నడకతో ఆరోగ్య ప్రయోజనాలు గుర్తించి 32ఏళ్ల క్రితం విశాఖ కేంద్రంగా వాకర్స్ ఇంటర్నేషనల్ ఆవిర్భావం జరిగిందని గుర్తు చేశారు. లయన్స్, రోటరీ వంటి సేవా సంస్థలకు ధీటుగా సామాజిక సేవలో నడక సంఘాలు ముందున్నాయన్నారు. విజయవాడ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మోటూరి ప్రభాకర్ మాట్లాడతూ పర్యావరణ, ప్లాస్టిక్ నివా



ఆర్థిక సహాయం అందుకున్న ఉత్తమ పేద విద్యార్థులతో వాకర్స్ ప్రతినిధులు

రణ, మెడికల్ క్యాంపులు నిర్వహణ వంటి అనేక కార్యక్రమాలు చేస్తున్నట్లు వివరించారు. అనంతరం నడక–ఆరోగ్యం పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో వాకర్స్ జిల్లా అధ్యక్షుడు రామలింగరాజు, వాకర్స్ ప్రతినిధులు సాంబిరెడ్డి, అమరనాథ్, ప్రసాద్, విశ్వేశ్వరరావు, చక్రధర్, చంద్రశేఖర్, రామకృష్ణ, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో చదువుకు దూరం కాకూడదు

పటమట(విజయవాడతూర్పు): ఆర్థిక ఇబ్బందులతో విద్యార్థులు చదువుకు దూరం కాకూడదని మాజీ మేయర్ కోనేరు శ్రీధర్ అన్నారు. ఆదివారం కోనేరు అచ్చమాంబ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఫీజుల పంపిణీ కార్యక్రమం జరిగింది. పటమటలోని కోనేరు శ్రీధర్ ఇంటిలో బీటెక్ విద్యార్థిని జె.కుసుమకు రూ.20 వేలు, బీఏ విద్యార్థిని టి. సింధుకు రూ. 4 వేలు ఫీజుల నిమిత్తం నగదును ఆయన అందించారు. ట్రస్ట్ చైర్మన్ కోనేరు వెంకట రమేష్, అడ్వకేట్ కోనేరు రాజేష్, 12వ డివిజన్ కార్పొరేట్ పొట్లూరి సాయిబాబు, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ దుగ్గిరాల రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

రౌడీషీటర్లు గొడవల్లో ఉంటే జైలుకే

సెంట్రల్ జోన్ ఏసీపీ ఎస్కే ఖాదర్‌బాషా

ఆటోనగర్(విజయవాడతూర్పు): గొడవలు సృష్టించడం... ఇందులో ప్రమేయం ఉంటే జైలుకు పంపిస్తామని విజయవాడ సెంట్రల్ జోన్ ఏసీపీ ఎస్కే ఖాదర్‌బాషా రౌడీషీటర్లను హెచ్చరించారు. ఆదివారం ఫన్‌టైమ్స్ రోడ్డులోని ఏసీపీ కార్యాలయం ఆవరణలో రౌడీషీటర్‌లకు ఆయన కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీరు మంచిగా ఉండాలని, మీ ప్రవర్తన మార్చుకోవాలి లేకపోతే రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపించాల్సి ఉంటుందని హెచ్చరించారు. గంజాయి అమ్మడం.. తాగడం లాంటివి చేయకూడదని సూచించారు. మద్యం షాపుల వద్ద గొడవలు చేయకూడదన్నారు. మీ ప్రాంతాల్లో ఏవైనా సంఘటనలు జరిగితే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. మీ పద్ధతి మార్చుకుంటే ఏడాది తర్వాత రౌడీషీట్‌లను తొలగిస్తామన్నారు. కుటుంబ అభివృద్ధికి బంగారు బాటలు వేసుకోవాలని వారిని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఐ కాశీవిశ్వనాథ్, ఎస్సైలు జాన్‌బాషా, వల్లి పద్మ, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కళాకారులను ప్రోత్సహించాలి

విజయవాడ కల్చరల్: కళాకారుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణ మూర్తి అన్నారు. శ్రీ సరస్వతీ కళాపీఠం, తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి చారిటబుల్ సంస్థ ఆధ్వర్యంలో శోభకృతి ఉగాది వేడుకల సందర్భంగా గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికపై ఆదివారం శోభకృతు ఉగాది వేడుకలు, వివిధ జిల్లాలనుంచి వచ్చిన గాయనీ గాయకులకు ఆత్మీయ సత్కారం, సినీ సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కళాకారుల సాంస్కృతిక వారధులని వారి సేవలను వినియోగించుకోవాలన్నారు. సాంస్కృతిక కళా సంస్థలు కళాకారుల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. సీనియర్ గాయకుడు తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో కొమ్మినేని రత్నకుమారి, చందన, వడ్డాది కామేశ్వరి, మాధవి, కొప్పరపు ఉమాబలరాం పలు చిత్రగీతాలను మధురంగా ఆలపించారు. మధిర రోజా ప్రసన్న ఈల పాటతో అలరించారు. వెంకటేశ్వర కళాపీఠం వ్యవస్థాపకుడు పీసుపాటి సుబ్రహ్మణ్య శాస్త్రి పాల్గొన్నారు.

త్రిశక్తి పీఠంలో దక్షిణామూర్తి హోమం

కృష్ణలంక(విజయవాడతూర్పు): పదో తరగతి, ఇంటర్ విద్యార్థుల పరీక్షా సమయాన్ని దృష్టిలో ఉంచుకుని బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో ఆదివారం శ్రీసరస్వతీ సహిత మేధా దక్షిణామూర్తి హోమం ఘనంగా నిర్వహించారు.

మాతృప్రేమ అనంతం

విజయవాడ కల్చరల్: మాతృప్రేమ అనంతమైనదని దానికి పరిమితిలేదని ఆకాశవాణి విశ్రాంత సంచాలకురాలు ముంజులూరి కృష్ణకుమారి అన్నారు. హాస్యానందం మాసపత్రిక దండెరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో గవర్నర్‌పేటలోని బుక్ ఫెస్టివల్ సొసైటీ హాల్‌లో ఆదివారం సాహితీవేత్త జాంబువతి జ్ఞాపకార్థం గుత్తికొండ లక్ష్మికి బంగారుతల్లి పురస్కారం, హాస్యానందం మాసపత్రిక నిర్వహించిన కథల పోటీ విజేతలు, కార్టూన్ పోటీ విజేతలకు బహుమతి ప్రదానోత్సవ సభను నిర్వహించింది. కృష్ణకుమారి మాట్లాడుతూ మాతృదేవోభ అన్న సూక్తిని నిజం చేస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్న హాస్యానందం నిర్వాహకుడు రాము పండా సేవలను కొనియాడారు. తెలుగు సంస్కృత అకాడమీ సభ్యుడు డాక్టర్ కప్పగంతు రామకృష్ణ మాట్లాడుతూ విలువలతో కూడిన కార్యక్రమాలు నిర్వహిస్తూ, యువ కథకులను, కార్టూనిస్టులను ప్రోత్సహిస్తున్న హాస్యానందం సంపాదక వర్గాన్నిఅభినందించారు. కార్యక్రమం



గుత్తికొండ లక్ష్మికి బంగారుతల్లి పురస్కారం ప్రదానం చేస్తున్న కృష్ణకుమారి, డాక్టర్ కప్పగంతు రామకృష్ణ

లో ప్రముఖ చిత్రకారుడు, కార్టూనిస్ట్ బ్నిం, సీనియర్ చిత్రకారుడు ఎవీఎమ్, కార్టూన్ రంగానికి చెందిన కేవీవీ సత్యనారాయణ, దండెంరాజు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ డీఎస్వీ రామశర్మ, డాక్టర్ వీవీ రాంకుమార్ పాల్గొన్నారు. అమ్మాయే నవ్వితే అంశంగా నిర్వహించిన కథల పోటీ విజేతలకు, కార్టూన్ పోటీ విజేతలకు బహుమతులను అందజేశారు.

పాస్టరు కుటుంబానికి ఆర్థిక సాయం

కంకిపాడు: ఆపన్నులకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తామని రక్ష ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. మండలంలోని ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన పాస్టరు ఈడా దావీదు (శ్రీరామమూర్తి) ఇటీవల మృతి చెందాడు. ఈ మేరకు మృతుని భార్య శామలమ్మకు ఫౌండేషన్ చైర్మన్, మైలవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకులు పడమట సురేష్‌బాబు వితరణతో రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని ఆదివారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఫౌండేషన్ తరపున సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టనున్నామని తెలిపారు.



దావీదు కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న రక్ష ఫౌండేషన్ ప్రతినిధులు

టెక్నాలజీపై డ్రైవర్లు అవగాహన పెంచుకోవాలి

ఎంవీఐ చింతా సంపత్‌కుమార్

హనుమాన్‌జంక్షన్ రూరల్: మారుతున్న టెక్నాలజీపై డ్రైవర్లు అవగాహన పెంచుకోవాలని, రోడ్డు భద్రతా నియమాలు తప్పక పాటించాలని రాజమండ్రి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ చింతా సంపత్‌కుమార్ అన్నారు. స్థానిక విజయవాడ రోడ్డులో ఏర్పాటు చేసిన తెలుగురాష్ట్రాల భారీ వాహన డ్రైవర్లు అండ్ క్లీనర్ల హక్కుల సాధన సమితి ప్రధాన కార్యాలయం ప్రారంభోత్సవంలో ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆటో మొబైల్ రంగంలో సాంకేతికత వేగంగా పెరుగుతుందన్నారు. వాహన తయారీ కంపెనీలు డ్రైవర్లకు శిక్షణను ఇచ్చిన తర్వాతే మార్కెట్‌లోకి వాటిని విడుదల చేస్తున్నాయని సంపత్‌కుమార్ తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో డ్రైవర్లు ఎప్పటికప్పుడు అందుబాటులోకి వస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. వాహనాలను నడిపేటప్పుడు డ్రైవర్లు తమ కుటుంబాన్ని గుర్తు తెచ్చుకోవాలన్నారు. తెలుగురాష్ట్రాల భారీ వాహన డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ హక్కుల సాధన సమితి అధ్యక్ష, కార్యదర్శులు ఎం.దుర్గారావు, ఎస్.బాబురావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం డ్రైవర్లు, క్లీనర్ల సంక్షేమ



మాట్లాడుతున్న ఎంవీఐ సంపత్‌కుమార్

బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. డీజిల్ అమ్మకాలపై లీటరుకు రూపాయి చొప్పున కేంద్ర ప్రభుత్వ పన్నులో వాటాను డ్రైవర్లు, క్లీనర్ల సంక్షేమ బోర్డు కోసం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు రంగంలో పనిచేస్తున్న డ్రైవర్లు, క్లీనర్లకు పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలను కల్పించాలని కోరారు. సమితి ముఖ్యనాయకుడు వసంత తుకారాం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భవిష్యత్ భద్రతా దళం వ్యవస్థాపకుడు యలమంచిలి మురళీకృష్ణ, ప్రముఖ ట్రాన్స్‌పోర్టు వ్యాపారి కనుమూరి సూర్యనారాయణ రాజు (చిన్నరాజు), హక్కుల సాధన సమితి హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు రామ్మోహనరావు, సుధాకర రావు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

కంకిపాడు: మండలంలోని పునాదిపాడులో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ఆదివారం పర్యటించారు. గ్రామానికి చెందిన ముసిబోయిన శ్రీను ఇటీవల ప్రమాదవశాత్తూ మృతి చెందటంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఘటన వివరాలను తెలుసుకుని బాధిత కుటుంబానికి సంతాపం తెలిపారు. ఎల్లప్పుడూ అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, మాజీ సర్పంచ్ ముసిబోయిన వెంకటేశ్వరరావు, నాయకులు ముసిబోయిన



మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

నాగరాజు, జొన్నలగడ్డ శ్రీను, ఎం.మోహనకృష్ణ, టీ. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గ్లకోమాపై ప్రజల్లో అవగాహన పెరగాలి

పెనమలూరు: అంధత్వం కలిగించే గ్లకోమా పై ప్రతి ఒక్కరూ అవగాహన పొందాలని తాడిగడప మున్సిపల్ కమిషనర్ ఎస్.ప్రకాశరావు తెలిపారు. ఆయన తాడిగడప ఎల్‌వి.ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో గ్లకోమా అవగాహన నడకను ఆదివారం ప్రారంభించి ప్రసంగించారు. గ్లకోమా నిశ్శబ్ద చూపు దొంగన్నారు. ఈ వ్యాధి పై అవగాహన లేకపోతే చూపుపోయే ప్రమాదం ఉందన్నారు. ఎల్‌వి.ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ అధిపతి డాక్టర్ అనసూవ గంగూలికపూర్ మాట్లాడుతూ గ్లకోమా వలన అంధత్వం రాకుండా నివారించటానికి అవకాశం ఉందన్నారు. సరైన అవగాహన లేకపోవటంవలన నేడు 7 మిలియన్ల మంది గ్లకోమాతో కంటి చూపు పోగొట్టుకున్నారన్నారు. వీరిలో మహిళల శాతం ఎక్కువగా ఉందని తెలిపారు.



గ్లకోమా పై అవగాహన నడకను ప్రారంభిస్తున్న కమిషనర్ ప్రకాశరావు

గ్లకోమా కంటి ఒత్తిడి కారణంగా సమస్య వస్తుందన్నారు. దీని వలన కంటి నరాలు దెబ్బతింటాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలో ఉండాలన్నారు. గ్లకోమా నడక పెద్ద ఎత్తున నిర్వహించారు.

పంట నష్టం అంచనాల్లో అధికారులు

ఉయ్యూరు: పంట నష్టం సర్వేలో అధికారులు నిమగ్నమయ్యారు. మూడు రోజులుగా కురుస్తున్న ఈదురుగాలులు, వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించి సమగ్ర నివేదిక తయారు చేయాలని ప్రభుత్వం ఆదేశించటంతో అధికారులు గ్రామాల్లో పంట పొలాలను సందర్శించి దెబ్బతిన్న పొలాలను పరిశీలించి అంచనాలను రూపొందించే పనిని ఆదివారం చేపట్టారు. మండలంలోని గండిగుంట, ఆకునూరు, చిన ఓగిరాల, పెద ఓగిరాల, కాటూరు గ్రామాల్లో గన్నవరం ఏడీఏ సునీల్, ఏఓ నిస్సి గ్రేస్ పర్యటించి మొక్కజొన్న, అరటి, మినుము, ఇతర పంటలు పరిశీలించారు. పంటనష్టంపై రైతులతో ప్రత్యేకంగా మాట్లా



గండిగుంటలో మొక్కజొన్న తోటను పరిశీలిస్తున్న ఏడీ సునీల్, ఇతర అధికారులు

డారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పంట నష్టం అంచనాలను సమగ్రంగా సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఏడీఏ సునీల్ తెలిపారు.

మండలం నుంచి 2672 మంది టెన్త్ విద్యార్థులు

విజయవాడ రూరల్: ఏప్రిల్ నెల 3వ తేదీ నుంచి జరుగనున్న పదో తరగతి కామన్ పరీక్షలకు విజయవాడ రూరల్ మండలం నుంచి 2672 మంది విద్యార్థులు హాజరుకానున్నారని ఎంఈవో ఆదూరి వెంకటరత్నం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలురు 1390 మంది, బాలికలు 1282 మంది చొప్పున టెన్త్ విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. గతంలో ఒక్కో సబ్జెక్టుకు రెండు పేపర్ల చొప్పున విద్యార్థులు పరీక్షలు రాసేవారని, ప్రస్తుత నిబంధనల ప్రకారం 6 సబ్జెక్ట్‌లకు 6 ప్రశ్నాపత్రాలు మాత్రమే ఉంటాయని, వాటికి విద్యార్థులు సమాధానాలు రాయాల్సి ఉందన్నారు. 3వ తేదీన ఫస్ట్ ల్యాంగ్వేజ్ పేపర్–1(గ్రూప్–ఎ), 6న సెకెండ్ ల్యాంగ్వేజ్, 8న ఇంగ్లిష్, 10న లెక్కలు, 13న సైన్స్, 15న సోషల్ 17న ఫస్ట్ ల్యాంగ్వేజ్ పేపరు–2, 18న ఎస్ఎస్‌సీ ఒకేషనల్ కోర్సు (థీయరీ) ఉంటుందన్నారు. జంబ్లింగ్ పద్ధతిలో పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రతి విద్యార్థి నిర్దేశించిన పరీక్షా కేంద్రాలకు సమయానికి హాజరు కావాలని ఎంఈఓ సూచించారు.

ప్రతి ఇంటికీ సంక్షేమం వైఎస్సార్ సీపీ ఘనత

గన్నవరం రూరల్: రాష్ట్ర ప్రజలకు గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో సంక్షేమాన్ని అందించిందని ఎంపీపీ అనగాని రవి చెప్పారు. ఆదివారం రాత్రి మండలంలోని మాదలవారిగూడెంలో 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ గృహసారథులు, సచివాలయం కన్వీనర్‌లు క్షేత్ర స్థాయిలో నిరంతరం పర్యటిస్తూ ప్రజల అవసరాలు గుర్తిస్తూ, వాటిని ప్రభుత్వ పరంగా తీర్చేందుకు కృషి చేయాలన్నారు. పార్టీ బలోపేతానికి కంకణబద్ధులు కావాలన్నారు. మండల గృహసారథులు, సచివాలయాల కన్వీనర్ల కన్వీనర్ కైలే శివకుమార్, పార్టీ అధ్యక్షుడు పడమట సురేష్, ఏఎంసీ ఛైర్మన్ ఆర్.అంజనీకుమారి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్‌వీఆర్, జెడ్పీ



మాట్లాడుతున్న ఎంపీపీ అనగాని రవి

టీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని, సర్పంచ్ బి.లక్ష్మీప్రసన్న, జిల్లా యూత్ విభాగం ప్రధాన కార్యదర్శి నాగనబోయిన గిరీష్‌రాజ్, గజగంటి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెనమలూరు డివిజన్
90105 77706 (ఉయ్యూరు)
99122 20539 (పెనమలూరు)
90102 10382 (గన్నవరం)
Office mail : sakshiads@gmail.com